ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 29 ఫిబ్రవరి 2024




నాగలి, గదలతో పవన్, చంద్రబాబు



గూడెంలో ఉమ్మడి సభ

సూపర్ హిట్

రాష్ట్ర భవిష్యత్ కోసమే కలిశాం

ఆశీర్వదించండి.. గెలిపించండి

- ఉమ్మడి వేదికపై చంద్రబాబు, పవన్ పిలుపు
- సభలో భావోద్వేగాలు.. అభిమానుల కేరింతలు
- దూర ప్రాంతాల నుంచి భారీగా రాక
- ఎన్నికల ముందే టీడీపీ-జనసేన శ్రేణులకు అధినేతల దిశా నిర్దేశం

తాడేపల్లిగూడెం/ఏలూరు/భీమవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి బృందం): 'టీడీపీ-జనసేన పొత్తు తాడేపల్లి ప్యాలెస్‌ను కకావికలం చేస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం, వివిధ వర్గాల భవిష్యత్తు కోసం మేం కలిశాం. మమ్మల్ని ఆశీర్వదించండి.. గెలిపించండి' అంటూ టీడీపీ-జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అత్యంత ఉద్వేగంతో వైసీపీ పైకి వారు సవాళ్లు విసిరారు. ఇది నిజమా..? కాదా ? అంటూ సభికుల నుంచి సమాధానాలు రాబట్టిన ప్రసంగాలు సాగిన తీరు అందరిని హత్తుకుంది. 'తెలుగు జన విజయ కేతనం జెండా' పేరిట పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద బుధవారం సాయంత్రం నాలుగున్నరకు మొదలైన భారీ బహిరంగ సభ రాత్రి ఎనిమిది గంటల వరకు సాగింది. టీడీపీ-జనసేన ఎన్నికల పొత్తులో భాగంగా ఇటీవల 99 మంది పోటీ చేసే అభ్యర్థులతో తొలి జాబితాను ఇరు పార్టీలు ప్రకటించాయి. దీని తర్వాత ప్రజలకు ఉమ్మడి సంకేతం ఇచ్చేందుకు సాగిన సభకు తొలిసారిగా అధినేతలు ఇద్దరు ఒకే వేదిక పైకి వచ్చారు. ఇది అటు పవన్ అభిమానులకు, ఇటు చంద్రబాబు కేడర్‌కు పండుగగా మారింది. ఇరువురు నేతలు పరస్పర ఆలింగనాలు సభికులకు మరింత కనువిందు చేసింది. ప్రత్యేకించి పొత్తు ఆ తదుపరి అభ్యర్థుల ప్రకటన తర్వాత ఎంతో క్రమశిక్షణతో నేతలు ఇద్దరు ఉమ్మడిగా జరిగిన సభలో అందరి మనసులు దోచారు. చంద్రబాబు సైతం సుమారు 50 నిమిషాలపాటు ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఎన్నికల ముందు ముద్దులు.. గెలిచాక మీడియాతో సహా అందరిపైన పిడిగుద్దులా అంటున్నపుడు సభికులు అవును అవునంటూ తెలిపారు.


కలిసే నడుస్తున్నాం : చంద్రబాబు

'ప్రజలకు రోషం ఉందా.. మాకైతే రోషం ఉంది. ఒక సీనియర్‌గా జరుగుతున్నందంతా చూస్తూ ఊరుకోలేను. ప్రశ్నించే గుణం ఉన్నా పవన్ సైతం మౌనంగా ఉండలేదు. జనం కోరుకునే వెలుగు మీకు ఇచ్చే బాధ్యత మాది' అంటూ చంద్రబాబు భరోసా ఇవ్వడం అందరిని సంతృప్తి పరిచింది. రాష్ట్ర విభజన అంశాలు ప్రజలకు గుర్తు చేస్తూ అప్పట్లో జరిగిన నష్టాన్ని ఎత్తిచూపాం. ఇప్పటికి అదే ధోరణిలో రాష్ట్రాభివృద్ధికి అనువుగానే జనసేన టీడీపీ లక్ష్యాల తీరు ఉందని చంద్రబాబు ప్రజలకు పదే పదే వివరించారు. ప్రజల కోసం కన్న కలల సౌధాన్ని జగన్ వచ్చి నాశనం చేశాడు. పొత్తు ఎందుకని ఆలోచిస్తే అందరికి అవగాహన వస్తుంది. ఆఖరికి అంతర్జాతీయ క్రికెటర్ విహారిని రాష్ట్రం నుంచి పారిపోయేలా చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అంటూ గుర్తు చేసినప్పుడు షేమ్ షేమ్ అంటూ సభికులు ప్రతిస్పందించారు. సినిమా టిక్కెట్లలోను రాజకీయాలు చేయడం ఎంత వరకు సబబు. ఇది భావ్యమా' అంటూ ప్రశ్నించి సభికుల నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ఉద్యోగుల అంశాలను ప్రస్తావిస్తూ ఇప్పుడున్న ప్రభుత్వం ఉద్యోగులపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏం చేయబోతున్నామో త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కిందిస్థాయి కేడర్‌లో ఉన్న భావాలను స్పృశిస్తూ ..ఇగోలకు పోవద్దు.. ఒక పార్టీ వెనుక ఇంకో పార్టీ నడుస్తున్నట్టు భావిస్తారు. ఇదంతా కాదు రెండు పార్టీలు కలిసి నడుస్తాయని భావించాలని, అనుభవంతో చెబుతున్నానని చంద్రబాబు ప్రకటించినప్పుడు టీడీపీ-జనసేన కేడర్ సంతృప్తితో కేరింతలు కొట్టారు. టీడీపీ కేడర్ ఎంపిక తీరుపై అక్కడక్కడ అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా పరోక్షంగా ప్రస్తావిస్తూ అందరికి తగిన న్యాయం చేయడం సాధ్యం కాదని, అవకాశాలను బట్టి అందరికి ఆమోదయోగ్యంగా న్యాయం చేస్తామన్నారు.

దద్దరిల్లిన సభ

రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారు. ఇరు పార్టీల అగ్రనేతలు ఒకే వేదిక పైకి రావడంతో ఈ వేదికకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. దీంతో వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు తరలి వచ్చారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, పవన్ వేదిక పైకి రాక ముందే పలువురు సీనియర్లు ప్రసంగించారు. వీరి ప్రసంగాలు ఆకర్షించాయి. నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణంరాజు, బాలకృష్ణ, వలవల బాబ్జి, దుర్గేష్, కొత్తపల్లి సుబ్బారాయుడు వంటి వారు మాట్లాడడంతో జనం కేరింతలతో సభ దద్దరిల్లింది. రఘురామకృష్ణంరాజు సెటైర్లు వేస్తున్నపుడు వేదికపై ఉన్న పవన్, చంద్రబాబు ముసిముసి నవ్వులు చిందించారు. తాను వచ్చే ఎన్నికల్లో నరసాపురం నుంచి పోటీ చేస్తానని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించినపుడు సభలో కేరింతలు వినిపించాయి.

> నాకు ఎవరి సలహాలు అక్కరలేదు. ఇటీవల సలహాలు ఇస్తూ బహిరంగ లేఖలు రాస్తున్నారు. కొందరు సీనియర్ల లేఖలు పొత్తుపై ప్రభావం చూపుతున్నాయి. ఒంటరిగా పోటీ చేసే శక్తి ఇప్పటికిప్పుడు జనసేనకు లేదు. నాపై విమర్శలు చేసే వారు ముందుగా దీనిపై ఆలోచించాలి.
> \- పవన్ కల్యాణ్



నాకు సలహాలు అక్కర్లేదు : పవన్

పవన్ కల్యాణ్ కూడా కాస్తంత ఉత్తేజభరితంగానే మాట్లాడుతూ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ఇంతకు ముందు జరిగిన తన ఓటమిని గుర్తు చేసుకున్నారు. పొత్తులో జనసేన ఎన్ని సీట్లు తీసుకోవాలి.. సీఎం పదవిని ఎలా పంచుకోవాలి అంటూ లేఖలతో సలహాలు ఇచ్చిన వారందరికి నర్మగర్భంగా మాట్లాడుతూ చెక్ పెట్టారు. ఆయన ఏమన్నారంటే.. 'నాకు ఎవరి సలహాలు అక్కరలేదు. జగన్ వెనుక ఉన్న సమూహాలు మాత్రం తప్పు చేసినా దోపిడీ చేసినా ఆహా.. ఓహో అంటూ ఉన్నారు. వెనకేసుకొస్తున్నారు. కాని, సామాన్యుడు రాజకీయం చేస్తే ఇలాగే ఉంటుందని నిరూపిస్తా. ఎవరికి ఎంత ఓపికో పరీక్షించుకోవాలి. నాతో నిలబడి.. నా వెంట నడిచేవారే నా వాడు. అంటూ పవన్ ఉద్వేగంగా మాట్లాడటంతో సభికులు నుంచి స్పందన లభించింది. ప్రత్యేకించి సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు, నేను రాష్ట్రం కోసమే కలిసి పని చేస్తామంటూ స్పష్టం చేశారు.




వేదికపై నేతలు

> రాష్ట్రంలో కులాల మధ్య, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి సర్వ నాశనం చేయాలని జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. నేను, పవన్ రాష్ట్రాన్ని నెంబర్-1 చేయాలనుకుంటున్నాం. బాధ్యత కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేశాం. వచ్చే ఎన్నికల్లో మన గెలుపును ఎవరూ ఆపలేరు.
> \- చంద్రబాబునాయుడు

అందరి చూపు వేదిక మీదే..

ఓ వైపు సభా సమయం రాత్రి గడుస్తున్నా అందరిచూపు వేదిక మీదే వుంది. టీడీపీ-జనసేన రాష్ట్ర నియోజకవర్గ నేతలు ఆసీనులు కావడమే నిదర్శనం. ఏ ఒక్క పార్టీ తక్కువ కాదని అంతా సమానమేని అన్నట్టుగా వేదికపైన మొత్తం 500 మంది కూర్చోగా రెండు పార్టీల నేతలకు చెరి సగం అన్నట్టుగానే సభా వేదిక ఏర్పాటు చేశారు. ఒక వైపు టీడీపీ జెండా, మరో వైపు జనసేన జెండా ఉండేలా ఈ పతకాల కిందే ఇరు పార్టీలు నేతలు ఆశీనులయ్యారు. ప్రత్యేకించి జనసేనలో కొత్తగా చేరిన కొత్తపల్లి సుబ్బారావు, కొణతాల రామకృష్ణ వంటి సీనియర్ నేతలు సైతం కొద్దిసేపు ప్రసంగించారు. రామకృష్ణ అయితే జనసేన టీడీపీ మాదిరిగానే ఈ రెండింటితో బీజేపీ కలిసి వచ్చేలా చూడాలని కోరడం మరో విశేషం. పవన్ తమ ప్రసంగం ఆఖరిలో బీజేపీకి జై అంటూ ముగించారు. టీడీపీ పక్షాన వేదిక ముందు భాగంలో చంద్రబాబుతోపాటు అచ్చెన్నాయుడు, బాలకృష్ణ, సీతారామలక్ష్మి, పితాని సత్యనారాయణ, వలవల బాబ్జి, రఘురామకృష్ణంరాజు కూర్చుండగా పవన్ పక్కన నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, కొటికలపూడి గోవిందరాజు, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు. టీడీపీలో సీనియర్ నేతలు బుచ్చియ్యచౌదరి, చినరాజప్పతో పాటు కొలుసు పార్థ సారథి, చింతమనేని ప్రభాకర్, ముళ్లపూడి బాపిరాజు, కంభంపాటి రామ్మోహన్, నిమ్మల రామానాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత పాల్గొన్నారు.





అభిమానుల జోష్

తెలుగుదేశం-జనసేన ఉమ్మడి సభలో అభిమానుల జోష్ అంతా ఇంతా కాదు. కార్యకర్తలను, అభిమానులను అడ్డుకోవడం పోలీసులు తరం కాలేదు. వీవీఐపీ గ్యాలరీకి అభిమానులంతా తోసుకుపోయారు. పోలీసులు సైతం చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను వీక్షించేందుకు ఫ్లడ్‌లైట్ స్తంభాలను ఎక్కేశారు. మహిళలు అందుకు పోటీ పడ్డారు. పసుపు చీరలు ధరించి వేలాదిగా మహిళలు సభకు తరలి వచ్చారు. దివ్యాంగులు సభకు విచ్చేశారు. అభిమానులు నృత్యాలతో చిందులు వేశారు. ఎండను సైతం లెక్కచేయలేదు. ఉభయ గోదావరి జిల్లాలతోపాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు. సిరపు వాసు అనే దివ్యాంగుడు ఒంటి కాలితోనే విశాఖ నుంచి స్కూటీపై ఇక్కడకు వచ్చి సభకు హాజరయ్యాడు. చిన్నారులు సైతం సభలో హల్‌చల్ చేశారు.


వేదికపై టీడీపీ, జనసేన నేతలు




బటన్‌రెడ్డిని సాగనంపుదాం
కొటికలపూడి గోవిందరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు



- పవన్ కల్యాణ్, చంద్రబాబు ఉమ్మడిగా ఈ ఎన్నికలకు పోటీకి రావడం అనేది ఇది ఒక గొప్ప కాంబినేషన్. రాష్ట్ర భవిష్యత్తుకు పునాది. రాష్ట్ర భవిష్యత్తు కోసం జెండా ఎగుర వేద్దాం. ఈవీఎం బటన్ నొక్కి.. బటన్ రెడ్డిని పారద్రోలుదాం.

ఇది దోపిడీ పాలన
బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి



- రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లింది. దోపిడీలు పెరిగాయి. హత్యలు, దౌర్జన్యాలతో ప్రజలను హింసిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిని ఏ సీఎం పాలనలో చూడలేదు. ఢిల్లీ వెళ్లే ముఖ్యమంత్రి పోలవరం ప్రాజక్టు, రాష్ట్ర అభివృద్ధి గురించి అడగకుండా కేసులు మాఫీకే తిరుగుతున్నారు. విశాఖను నాశనం చేశారు. అందుకే మనం అందరం ఒక్కటిగా ఈ ప్రభుత్వాన్ని సాగనంపుదాం.

తాడేపల్లిగూడెంలో సమస్యల తిష్ఠ
వలవల బాబ్జి, టీడీపీ తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి



- సీఎం జగన్ విధ్వంసకర పాలన అంతమొందించేందుకే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడి సభ ఏర్పాటు చేశారు. గూడెంలో టీడీపీ హయాంలో చేపట్టిన ఎన్నో అభివృద్ధి పనులను ఈ ప్రభుత్వం వచ్చాక వదిలేశారు. ఇక్కడ డిప్యూటీ సీఎం చిల్లరకొట్టు సత్యనారాయణ అధ్వాన్న పాలన వల్ల రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, అండర్ గ్రౌండ్ డ్రెయిన్, ఏపీ నిట్‌లో సీట్లు వంటి సమస్యలు ఉండిపోయాయి.

దుర్మార్గ పాలనను అంతమొందిద్దాం
కందుల దుర్గేష్, జనసేన రాజమండ్రి రూరల్ ఇన్‌చార్జి



- రాష్ట్రంలో అరాచక దుర్మార్గ పాలన అనే కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణార్జునులు వంటి చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపును దిశా నిర్దేశంగా భావిద్దాం. సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్ పాలనను అంతమొందిద్దాం.

దుర్మార్గ ప్రభుత్వాన్ని అడ్డుకోవడానికే..
మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు



ఓటు చీలకూడదు, జగన్ గెలవకూడదు. అతని దుర్మార్గ ప్రభుత్వాన్ని అడ్డుకోవడానికే పవన్, చంద్రబాబు కలిశారు. వీరి కలయికలో స్వార్థం లేదు. రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా మంచి సంకల్పంతో ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్నాం. ఈ పాలన పారద్రోలి సువర్ణ అధ్యాయాన్ని సృష్టిద్దాం.

జగన్‌ను తరిమికొట్టాలి
బొమ్మిడి నాయకర్, జనసేన నరసాపురం ఇన్‌చార్జి



- జగన్ మరోసారి అధికారం కోసం ఎన్నో అబద్ధాలతో ప్రజల వద్దకు వస్తున్నాడు. మత్స్యకారులను మోసం చేశాడు. అతన్ని తరిమికొట్టకపోతే పొట్ట చేత పట్టుకుని రాష్ట్ర ప్రజలు పొరుగు రాష్ట్రాలకు పారిపోవాల్సిందే.

రాష్ట్రం బిహార్‌ను గుర్తుచేస్తోంది
కేఎస్ జవహర్, మాజీ మంత్రి



- బిహార్‌లో దారుణాలను గుర్తు చేసేలా జగన్ పాలన సాగుతోంది. దళితులను హత్య చేస్తున్నారు. దాడులు పెరిగాయి. దీనిని అంతమొందించడానికి చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఏకమయ్యారు. మళ్లీ ఇప్పుడు జగన్ క్రైస్తవులను, హిందువులు, ముస్లింలను మోసం చేస్తూ ముందుకు వస్తున్నారు.

హైవేపై బైక్ ర్యాలీ.. సభా ప్రాంగణం వద్ద ఫ్లెక్సీలు





హైవేపై కార్ల ర్యాలీ




వేదికపై నాయకులు



వేదికపై జనసేన పార్టీ నాయకులు





ఒళ్లంతా జెండాలతో..



అన్న..ఎన్టీఆర్



తెలుగుదేశం పార్టీ నాయకులు



దాహం తీర్చేందుకు చల్లని మజ్జిగ

జెండా జోష్



పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడులో బుధవారం జరిగిన టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు జనం పోటెత్తారు.. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు తమ ప్రసంగాలతో ఇరుపార్టీల కార్యకర్తల్లో జోష్ నింపారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు.



ఫ్లడ్‌లైట్, ఫ్లెక్సీ స్తంభాలపై అభిమానులు



వయసు పైబడినా తగ్గేదేలే..



రెక్కలు విరిగిన ఫ్యాన్



తెలుగు మహిళల సందడి



తాడేపల్లిగూడెం నుంచి జనసేన ర్యాలీ





వేదిక ముందు యువత ఉత్సాహం

నేడు తాలూకా కేంద్రాల వద్ద ఏపీటీఎఫ్ ధర్నా

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 : ఏపీజేఏసీ ఇటీవల తలపెట్టిన చలో విజయవాడ ఆందోళన వాయిదా వేయడాన్ని నిరసిస్తూ దానిస్థానే సొంత పోరు బాటను పట్టిన ఏపీటీఎఫ్ గురువారం జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో ధర్నాకు పిలుపునిచ్చింది. నేటి నుంచి ఏలూరు పాత తాలూకా కేంద్రం వద్ద నిర్వహించనున్న ధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సీపీఎస్ రద్దు, 30 శాతం మధ్యంతర భృతి, పెండింగ్ డీఏల మంజూరు తదితర డిమాండ్‌లను ప్రభుత్వం ఎదుట ఉంచుతున్నామన్నారు.


3న విశాఖలో 'మహాగర్జన'

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 : కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై మార్చి 3న విశాఖపట్నంలో 'మహాగర్జన', ర్యాలీ, బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. వాల్‌పోస్టర్‌ను గురువారం ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ సభ్య సంఘం ఏపీఎన్‌హెచ్ఎం జేఏసీ రాష్ట్ర చైర్మన్ దయామణి ఆవిష్కరించారు. మహాగర్జన కు ఉద్యోగులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 99 శాతం హామీ లను అమలు చేశామని చెబుతున్న ప్రభుత్వం చిరుద్యోగులకు సమస్యలను విస్మరించిందన్నారు. జాతీయ ఆరోగ్య పథకం (ఏపీఎన్‌హెచ్ఎం) స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆప్తాల్మిక్ టెక్నీషియన్లు, 108 వాహనాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచారంలో బాలలను వినియోగిస్తే కఠిన చర్యలు

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: రానున్న సాధారణ ఎన్నికల ప్రచారంలో బాలలను వినియోగించకూడదని రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారని డీఆర్వో డి.పుష్పవాణి అన్నారు. బుధవారం డీఆర్వో ఛాంబర్‌లో ఓటర్ల జాబితా ప్రచురణ, పోలింగ్‌స్టేషన్‌లలో మౌళిక సదుపాయాలపై రాజకీయపార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ఫారం -7 క్రింద 1595 తొలగింపుకు ఎన్నికల ప్రధాన అధికారి అనుమతించారని తెలిపారు. జిల్లాలో 16 లక్షల 24 వేల 939 మంది ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయపార్టీ ప్రతినిధులు డి.రత్నబాబు, నెరుసు నెలరాజు,ఆదిశేషు, ప్రసాద్, అచ్యుత్‌బాబు,కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్సు ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



పెంటపాడు,, ఫిబ్రవరి 28: దేశ ఆర్థిక వ్యవస్థకు ఇంజనీరింగ్, సాంకేతికత, పరిశోధనలు మూల స్తంభాలని విద్యార్థులు సైన్స్ ఆధారిత ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. నిట్ ప్రాంగణంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దినేష్ శంకర్ మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భారత ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపచేసిన ఘనత సీవీ రామన్‌కే దక్కుతుందన్నారు. సీవీ రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ వీరేష్‌కుమార్, ఆచార్యులు డాక్టర్ సందీప్, రాముడు, తపస్ కిరణ్‌కుమార్, రఫీ పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా భావంతో మెలగాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 28: విద్యార్థులు చదువుతోపాటు సేవాభావంతో మెలగాలని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ మాజీ అధికారి టీబీఆర్ చైర్మన్ టి.భోగేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్న గూడెంలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉద్యాన కళాశాలలో బుధవారం యువ సంవాద్ ఇండియా 2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు మాధవి, సలోమి సునీత, శివకుమార్, ఉదయశ్రీ, పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరపనున్నారు. జిల్లాలో 50 కేంద్రాలలో 1వ తేదీ నుంచి 20 వరకు పరీక్షలు జరుగు తాయి. ప్రథమ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు 17,806, ద్వితీయ సంవత్సరం 18,143 మంది హాజరు కావల్సి ఉంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పాటు సెల్‌ఫోన్ రహిత జోన్‌గా ప్రకటించారు. పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ఏ అధికారి వద్ద సెల్‌ఫోన్ ఉండదని ఒక్క చీఫ్ సూపరిండెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ వద్ద బేసిక్ ఫోన్ ఉంటుందని ఎగ్జామ్ కన్వీనర్ చంద్రశేఖర్ బాబు తెలిపారు. ఇంటర్ పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని అధికారులు చెబుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష సమయం అని అరగంట ముందే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు క్యాలిక్యులేటర్, సెల్‌ఫోన్స్ తీసుకు రాకూడదన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

డ్రోన్‌ల వినియోగంపై రైతులకు అవగాహన అవసరం

ఉండి, ఫిబ్రవరి 28: రైతులకు డ్రోన్ వినియోగంపై ప్రత్యేక అవగాహన అవసరమని డాక్టర్ ముకుందరావు అన్నారు. బుధవారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. మార్టేరు అసోసియేట్ డైరక్టరు ఆఫ్ రీసెర్చ్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముకుందరావు డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. పశుసంవర్థక శాఖ డీడీ హలాస్పేస్ మాట్లాడుతూ రైతులు పశుగ్రాసాన్ని పెంచుకొనేందుకు కేవీకే ప్రోత్సాహం అందించాలన్నారు. అసోసియేట్ డైరక్టరు డాక్టర్ శ్రీనివాస్ మామి డిలో పండు ఈగ నివారణకు శిక్షణ ప్రదర్శనలు నిర్వహించాలని ఆదే శించారు. మార్టేరు శాస్త్రవేత్త డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, డాక్టర్ రాఘవేంద్రరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు డిబోరి మెషియానా, శ్రీనివాసరావు, రాజేష్, బి.రజిత, మత్స్యశాఖ అధికారిణి ప్రియదర్శిని, బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ పుల్లంరాజు, తదితరులు పాల్గొన్నారు. రైతులు నెక్కంటి సుబ్బారావు, వెంకట రత్నం, చందులను సత్కరించారు.

ఆన్‌లైన్‌లో ఫ్యాన్ ఆర్డర్ పెడితే రంగు డబ్బాలు..



పెనుమంట్ర, ఫిబ్రవరి 28 : ఆన్‌లైన్ యాప్‌లో ఒక యువకుడు ఫ్యాన్ బుక్ చేస్తే ఖాళీ రంగు డబ్బాలు రావడంతో నిర్ఘాంతపోయిన సంఘటన పెనుమంట్ర మండలం మార్టేరులో జరిగింది. మార్టేరుకు చెందిన నగేష్ ఆన్లైన్‌లో ఫ్యాన్ బుక్ చేశాడు. అయితే ఖాళీ పెయింట్ డబ్బా, అట్టముక్కలు రావడంతో బాధితుడు అవాక్కయ్యాడు. రిటర్న్ పంపి కంప్లైట్ ఇస్తానని నగేష్ తెలిపారు.



కాళ్ళ మండలం పెద అమిరంలో బుధవారం జరిగిన పాలకొల్లు వైసీపీ నాయకుడు గుణ్ణం నాగబాబు కుమారుడు మణికంఠ, విజయదీప్తిల వివాహ వేడుకలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించండి

మహా శివరాత్రి ఏర్పాట్లపై జేసీ సమీక్ష

పోలవరం, ఫిబ్రవరి 28 : పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాలలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అధికారులకు సూచించారు. బుధవారం పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మహా శివరాత్రి ఉత్సవాల రెండవ సమీక్షా సమావేశం ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య అధ్యక్షతన నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ అధికారులకు, విద్యుత్ అధికారులకు సూచించారు.ఆలయ కార్యనిర్వహణాధికారి సంగమేశ్వర శర్మ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశా మన్నారు. సమావేశానికి ఏజీఆర్‌బీ ఈఈ హాజరు కాకపోవడం పట్ల జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ హైవే అధికారులు రోడ్డుకి మరమ్మ తులు చేశామన్నారు. ఆర్టీసీ అధికారులు జంగారెడ్డిగూడెం డిపో నుంచి 30 బస్సులు, తాడేపల్లిగూడెం నుంచి 15 బస్సులు, కొవ్వూరు డిపో నుంచి 25 బస్సు లు నడుపుతామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ తెలిపారు. డిప్యూటి డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఉత్సవాల్లో 4 ప్రాంతాల్లో అత్యవసర వైద్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఇసుక తిన్నెల్లో రెండు చోట్ల



ఫెర్రీ ర్యాంపులో 1, ఆలయ ప్రాంగణంలో 1 ఏర్పాటు చేస్తున్నామని, 104, 108 , వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. మత్స్య శాఖ అధికారులు మాట్లాడుతూ నదిలో ప్రమాదాలకు తావులేకుండా 90 మంది గజ ఈతగాళ్ళను మూడు షిప్టులుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. బోట్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ నదిపై కాలినడక మార్గం కోసం 6 పంట్లు ఏర్పాటు చేస్తున్నామని 4 తేదీ సాయంత్రానికి అందజేస్తామన్నారు. జిల్లా పంచాయతీ అధికారి, తహశీల్దారు జీవీ.ప్రసాద్, సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, డీటీ ప్రసాద్, ఆలయ ట్రస్టీ జగన్నాథరావు,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీస్‌స్టేషన్‌లో తప్పిపోయిన బాలుడు



బుట్టాయగూడెం, ఫిబ్రవరి 28: తప్పిపోయిన బాలుడు బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడని ఆచూకి తెలిసినవారు సంప్రదించాలని ఎస్ఐ కె.వెకన్న తెలిపారు. దొరమామిడిలో ఒక బాలుడు ఒంటరిగా ఉండడం గమనించిన ఒక వ్యక్తి ఊరుపేరు అడిగితే బుట్టాయగూడెం వైపు వేలు చూపు తున్నాడని తాను లోపలి గ్రామానికి వెళ్ళిపోతానని పిల్లవాడిని బుట్టాయగూడెంలో దింపవలసిందిగా అటుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న మరొకరికి అప్పగించి వెళ్ళిపోయినట్లు పోలీసులు తెలిపారు. తెల్లంవారి గూడెం నుంచి బాలుడిని బుట్టాయగూడెం తీసుకువచ్చిన వ్యక్తి పిల్లవాడి పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఊరు పేరు అడుగుతున్నా చెప్ప లేకపోవడంతో స్టేషన్లో అప్పగించాడన్నారు. వివరాలు తెలిసిన వారు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

చెట్టు కొమ్మ విరిగిపడి ఒకరి మృతి

పాలకోడేరు, ఫిబ్రవరి 28 : మృత్యువు ఏ రూపంలో వస్తుందో ఎవరికీ తెలియదు. పాలకోడేరులో బుధవారం రాత్రి జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. పాలకోడేరుకు చెందిన తోట వెంకన్న (45) పని నుంచి వచ్చి ఇంటికి సమీపంలో రహదారి పక్కన ఒక రాయిపై కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇంతలో మోగల్లు వైపు నుంచి భీమవరం వెళ్తున్న ఇసుక లారీ పాలకోడేరు గ్రామంలోని కొత్తపేట వద్ద రహదారి పక్కనే ఉన్న కొబ్బరి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొబ్బరిచెట్టు విరిగి రాయి మీద కూర్చొన్న వెంకన్నపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

కడుపునొప్పి తట్టుకోలేక ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 : కడుపునొప్పితో బాధపడుతున్న ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముసునూరు మండలం వలస పల్లికి చెందిన మల్లినేని సురేష్ (38) వ్యవసాయం చేసేవాడు. కడుపునొప్పికి తాళలేక బుధవారం పురుగుమందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తణుకు, ఫిబ్రవరి 28 : తణుకు మండలం తేతలికి చెందిన వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. తేతలి గ్రామానికి చెందిన గంటా దైవనీతికి అదే గ్రామానికి చెందిన అనిల్ కుమార్‌తో గతేడాది వివాహమైంది. దైవనీతి ఈనెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్ళి రాకపోవడంతో, చుట్టుపక్కల గాలించి ఆచూకీ లేకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కీచక ఉపాధ్యాయుడి సస్పెన్షన్

పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన ..ఫోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 28 :పదో తరగతి విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ప్రాథమికోన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ (స్కూల్ అసిస్టెంట్) ఉపాధ్యాయుడు సస్పెన్షన్‌కు గురయ్యాడు. బుధవారం బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. తమ పిల్లలపై పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీహరిబాబు అసభ్యకర చేష్టలు చేస్తుంటే హెచ్ఎం, అధికారులు పట్టించుకోక పోవడం దుర్మార్గమని వాపోయారు. ఇటీవల పాఠశాలలో యూనిఫాం కొలతలను సేకరించే సమయంలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు స్కూల్‌కి వచ్చి సంబంధిత ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలంటూ ఆందోళన చేశారు. విద్యార్థినిలపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు శ్రీహరిబాబుపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు.దీనిపై విద్యాశాఖ అధికారులు విచారణ చేసి ఉన్నతాధికారులకు తెలిపారు. ఉపాధ్యాయుడు శ్రీహరి బాబును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం ఉత్తర్వులు జారీ చేసినట్టు మండల విద్యా శాఖ అధికారి రాముడు తెలిపారు.

రక్షణ కల్పించండి..ఎస్పీకి జడ్పీ చైర్మన్ వినతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 : తన కారును వెంబడించి ఢీ కొట్టేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ఎస్పీని కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతికి వినతిపత్రం అందించారు. ఈ నెల 27 రాత్రి సత్యవోలు వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తూరులో టీడీపీ నాయకుడు చింతమనేని ప్రభాకర్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించుకుంటున్నారని తమ కార్లకు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారన్నారు. కొందరు మూడు కార్లతో తమను వెంబడించి ఢీ కొట్టడానికి ప్రత్నించారన్నారు. జిల్లా ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు.

గోడ కూలి చిన్నారి మృతి

తణుకు, ఫిబ్రవరి 28: రోడ్డుపై నడిచి వెళుతున్న చిన్నారిపై అకస్మాత్తుగా గోడ కూలి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. ఇరగవరం మండలం పేకేరుకు చెందిన చిక్కా విజలక్ష్మి (5) చిన్నారికి మెడపై కంతి ఉండటంతో చిన్నారి తల్లి వేణి రెండు రోజులు క్రితం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం బలిజేపల్లి వారి వీధిలో ఉన్న ఆమె బంధువుల ఇంటికి తీసుకెళ్ళారు. చిన్నారిని తల్లి వేణి మంగళవారం నడిపించుకొని ఇంటికి తీసుకువెళుతుండగా పెరవలి మండలం పిట్టలవేమవరానికి వచ్చే సరికి గుడిమెట్ల రమాదేవి స్థలానికి చుట్టూ ఉన్న గోడ అకస్మాత్తుగా కూలి పక్కనే నడుస్తున్న చిన్నారిపై పడింది. దీంతో తలకు తీవ్ర గాయమైంది. చిన్నారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారుల ఫిర్యాదు మేరకు స్థల యజమాని రమాదేవిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగునీరివ్వండి



ప్రగడవరంలో రోడ్డుపై ఖాళీ బిందెలతో బైఠాయించిన మహిళలు

చింతలపూడి, ఫిబ్రవరి 28: మండలంలోని ప్రగడవరం ప్రకాష్‌నగర్‌లో తాగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజులుగా నీటి సరఫరా కాకపోవడంతో ఆగ్రహించిన మహిళలు, పిల్లలు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఎండా కాలం వస్తున్నా చర్యలు తీసుకోకపోవడంతో తాము ఎక్కడికి పరిగెత్తాలంటూ ప్రశ్నించారు.

టెన్త్ పరీక్షల నిర్వహణపై రాష్ట్ర పరిశీలకుడి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28: జిల్లాలో టెన్త్ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, హైస్కూల్ హెచ్‌ఎంలతో టెన్త్ పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ డైరెక్టర్ ఆర్.నరసింహారావు బుధవారం సమీక్షించారు. పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మార్చి 2న జిల్లాలోని పాఠశాలలు సందర్శిస్తారని, ఎటువంటి లోటుపాట్లులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంలకు సూచించారు. తరగతిగదుల్లో ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పి), బైజూస్ కంటెంట్, ట్యాబ్‌ల వినియోగంపై దృష్టిసారిస్తారని, టీచర్ల లెసన్‌ప్లాన్స్, విద్యార్థుల వర్క్‌బుక్‌ల కరెక్షన్ కూడా పరిశీలించే అవకాశం ఉందన్నారు. మరో 18రోజుల్లో ప్రారంభంకానున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాను కనీసం టాప్ టెన్ స్థానంలోనైనా ఉంచేలా ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో కష్టపడి పనిచేయాలన్నారు. పరీక్షల విధులకు, స్పాట్ వాల్యూయేషన్‌కు టీచర్లు సెల్‌ఫోన్లను తీసుకువెళ్ళి ఇబ్బందులు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. డీఈవో అబ్రహం, డీవైఈవోలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్, ఎంఈవోలు పాల్గొన్నారు.

టెట్‌కు 54 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 : టెట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. బుధవారం ఉదయం పరీక్షకు 366మంది అభ్యర్థులకు 340 మంది, మధ్యాహ్నం పరీక్షకు 367మంది అభ్యర్థులకు 339 మంది హాజరయ్యారని ఆయన వివరించారు.

అంబేడ్కర్‌ను అవమానించేలా ప్రశ్నలు.. డీఈవోకు ఫిర్యాదు



డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న బీటీఏ నేతలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28: ఫార్మేటివ్ (ఎఫ్ఏ-4) పరీక్షల్లో భాగంగా ఈ నెల 26న జరిగిన 8వ తరగతి సోషల్ ప్రశ్నాపత్రంలో 5వ ప్రశ్న బీఆర్.అంబేడ్కర్‌ను అవమానించేదిగా ఉందని టీచర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నాయకులు బుధవారం డీఈవో అబ్రహంకు ఫిర్యాదు చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, సీహెచ్.ధర్మలింగం వివరాలు తెలిపారు. 'దళిత ఉద్యమ నాయకుడు ఎవరు' అనే ప్రశ్నకు జవాబుగా అంబేడ్కర్‌ను పేర్కొనడంపై అభ్యంతరం తెలిపారు. బహుముఖ ప్రజ్ఞాశాలిని ఒక దళిత నాయకుడిగా ముద్ర వేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. దీనికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠ్యాంశాల్లో కూడా దళిత నాయకుడిగా మాత్రమే ముద్రించడాన్ని తప్పుబడుతూ పునఃముద్రితం చేయాలని రాష్ట్ర విద్య, శిక్షణ, పరిశోధన మండలి(ఎస్సీఈఆర్టీ) ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తామన్నారు. డీఈవోను కలిసిన వారిలో శ్రీనివాసరావు, రమణ, కృపాకిరణ్, తదితరులు ఉన్నారు.

రైతు భరోసా రూ.12.34 కోట్లు : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: జిల్లాలో 2,08,073 మంది రైతులకు రూ.12.34 కోట్లు పెట్టుబడి సాయం అందించినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం, వడ్డీ రాయితీ, వైఎస్ఆర్ సున్నావడ్డీ పంట రుణాల పథకంలో తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చ్యువల్‌గా రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. జిల్లాస్థాయి కార్యక్రమం బుధవారం కలెక్టరేట్‌లో ప్రసన్న వెంకటేశ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి హబీబ్‌బాషా, పలువురు రైతులు, అధికారులు పాల్గొన్నారు. వైఎస్సార్ రైతుభరోసా, సీఎం కిసాన్ పథకం క్రింద ఏలూరు జిల్లాలోని 2,04,642 మంది రైతులకు రూ.41.30కోట్లు, 2023-24 ఏడాది సున్నావడ్డీ రాయితీగా రూ.36,965మంది రైతుల ఖాతాలకు 8.16కోట్లు మెగా చెక్కులను రైతులకు అందజేశారు.

రేపటి నుంచి ఎంఎస్‌ఎంఈ సర్వే

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరును మెరుగుపరిచి డేటాబేస్ అభివృద్ధి చేసేందుకు మార్చి 1 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజరు ఆదిశేషు బుధవారం తెలిపారు. ఈ సర్వేకోసం నియమించిన బృందానికి ఎంఎస్ఎంఈ అసోసియేషన్‌లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్‌లు, వర్తక, వాణిజ్య సంఘాలు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలు అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణాల్లో వార్డు సెక్రటరిలు సర్వే చేస్తారని తెలిపారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు అదనపు డెవలప్‌మెంట్ కమిషనర్ల ద్వారా సర్వే పురోగతిని కలెక్టర్ పర్యవేక్షిస్తారన్నారు.

దివ్యాంగులకు ఉత్తమ సేవలందించాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 28: ప్రత్యేక ఉపాధ్యాయులు, దివ్యాంగులకు ఉత్తమ సేవలు అందించాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ పి.రాకాడమణి అన్నారు. దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలు దివ్యాంగుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. సీఆర్‌ఈ కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. రీసోర్స్‌పర్సన్స్ ఎస్ఏ నాయుడు, టి.హరిబాబు, కె.ధరేందర్‌రెడ్డి, ఎ.అమ్మాజి, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరు నుంచి ర్యాలీగా వెళుతున్న గన్ని



దెందులూరు నుంచి ర్యాలీ ప్రారంభిస్తున్న చింతమనేని



ఏలూరు నుంచి ర్యాలీగా వెళుతున్న బడేటి చంటి, కార్యకర్తలు



చింతలపూడిలో ర్యాలీ ప్రారంభిస్తున్న ముత్తారెడ్డి

తాడేపల్లిగూడెం తరలివెళ్లిన

తెలుగు జనం

వందలాది వాహనాల్లో టీడీపీ, జనసేన శ్రేణులు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 28: తాడేపల్లిగూడెంలో బుధవారం జరిగిన తెలుగు జన జయకేతనం జెండా సభకు జిల్లా నలుమూలల నుంచి తెలుగు దేశం పార్టీ, జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. పలు నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు వాహనాలపై ర్యాలీగా తరలివెళ్లారు. ఏలూరు మినిబైపాస్ రోడ్డులో సీసీ క్లబ్ వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ద్విచక్ర వాహనాలపై వందలాది మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు నగరంలో ర్యాలీ నిర్వహించి తాడేపల్లిగూడెం తరలివెళ్లారు.

● జంగారెడ్డిగూడెం: టీడీపీ, జనసేన బహిరంగ సభకు జంగారెడ్డిగూడెం పట్టణం, మండలం నుంచి భారీగా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బస్సులు, కారులు, బైక్‌ల ప్రయాణాలతో కార్యకర్తలు సందడి చేశారు. జంగారెడ్డిగూడెం నుంచి చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ జెండాను ఊపి బస్సులు, కారులను ప్రారంభించారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు ఆకుల రాకేష్, నాయకులు పెనుమర్తి రామ్‌కుమార్, షేక్ ముస్తఫా, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, చిలపరెడ్డి ఇంద్రాణి, పగడం సౌభాగ్యవతి, గుళ్లపూడి శ్రీదేవి, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, తూటికుంట రాము, కొఠారి ప్రసాద్, కొండ్రెడ్డి వీరాస్వామి, ముళ్లపూడి గంగాధర శ్రీనివాస్, ఎలికే ప్రసాద్, గొల్లమండల శ్రీను, ఉండవల్లి రవిశంకర్, కుక్కల మాధవరావు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

● దెందులూరు: తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన సభకు స్వచ్ఛందంగా వచ్చిన జన సందోహం చూస్తే తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి నిద్ర రాదని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. నాలుగు మండలాల టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలతో కలసి తాడేపల్లిగూడెం భారీ బహిరంగ సభకు మోటార్ సైకిల్, కార్ల ర్యాలీకి గుండుగొలను (శింగవరం)లో చింతమనేని జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు.

● ఉంగుటూరు: తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభకు జాతీయ రహదారి పసుపుమయమైంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు నేతృత్వంలో నారాయణపురం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లారు. జనసేన శ్రేణులు నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు నేతృత్వంలో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లారు.

● లింగపాలెం: మండలం నుంచి తెలుగుదేశం నేతలు తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరావు, పలువురు నాయకుల ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు కార్లు, ఆటోలలో తరలివెళ్ళారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

● బుట్టాయగూడెం: తాడేపల్లిగూడెం సభకు టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, జనసేన నాయకులు చిర్రి బాలరాజు, కరాటం సాయిబాబా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ నాయకులు క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరగా జనసేన నాయకులు బుట్టాయగూడెం సెంటరులో కలసి ర్యాలీగా తరలివెళ్ళారు. మొగపర్తి సోంబాబు, యంత్రప్రగడ శ్రీనివాస రావు, గద్దె అబ్బులు, ఆలపాటి ఫణికిషోర్, సున్నం నాగేశ్వరావు, మడకం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లారు. ద్విచక్ర వాహనాలు, చిన్నకార్లు, వ్యానులపై ర్యాలీగా వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, ఘంటా సుధీర్, కోనేరు వెంకట సుబ్బారావు, నెక్కలపు సూర్యనారాయణ, కోనేరు వెంకట్రామయ్య(బుజ్జి), కోనేరు మోహన్, జయకృష్ణ, పసుమర్తి పార్థసారధిబాబు, గూడపాటి కేశవరావు, జిజ్జూరి బాబ్జీ, తూతా లక్ష్మణరావు, గోరిక దాసు, కంఠమనేని పుష్పరాజ్యం, కంఠమనేని సత్యనారాయణ, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, వేముల నాగేశ్వరరావు, మాన్యం దుర్గారావు, డోలా విజయ్, తదితరులు తరలివెళ్లారు.

● కొయ్యలగూడెం: తాడేపల్లిగూడెం సభకు పోలవరం నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన నాయకులు తరలివెళ్లారు. పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, టి.నర్సాపురం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నుంచి కార్లపై కొయ్యలగూడెం చేరుకుని ర్యాలీగా తరలివెళ్లారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు కార్లతో భారీ ర్యాలీగా వెళ్ళారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున టీడీపీ నాయకులు తరలివెళ్ళారు. ముడియం సూర్యచంద్రం ఆధ్వర్యంలో కూడా భారీగా సభకు తరలివెళ్ళారు. నరేష్, జ్యేష్ట రామకృష్ణ, తదితర నేతలంతా కార్యకర్తలతో కలసి తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్ళారు.

● టి.నరసాపురం: మండలంలోని టీడీపీ, జనసేన నాయకులు తాడేపల్లిగూడెం సభకు భారీగా తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు జయవరపు శ్రీరామూర్తి, శీలం వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కారులు, ద్విచక్రవాహనాలపై భారీగా తరలివెళ్లారు. తోట లక్ష్మీనారాయణ, పెద్దిన సత్యనారాయణ, గండబోయిన శ్రీనివాసరావు తదితరులుపాల్గొన్నారు.

● కుక్కునూరు: తాడేపల్లిగుడెం టీడీపీ జనసేన సభకు కుక్కునూరు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. వాహనాలపై ర్యాలీగా నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. కోటగిరి సత్యనారాయణ, పిచుక రాజు, జనసేన మండల అధ్యక్షుడు ఎం.యుగంధర్, ఎం.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: మండలం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు, జనసేన కార్యకర్తలు తాడేపల్లిగూడెం సభకు వందలాదిగా తరలి వెళ్లారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ, పోలసానపల్లి, అంబర్‌పేట, కురెళ్ళగూడెం గ్రామాల నుంచి ఉంగుటూరు చేరుకుని ర్యాలీగా తరలి వెళ్లారు.

● చింతలపూడి: మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్ళారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. మాటూరి వెంకట్రామయ్య, పక్కాల వెంకటేశ్వరరావు, బోడా నాగభూషణం, అనీష్‌కుమార్, జన సైనికులు పాల్గొన్నారు.

● పోలవరం: తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ జనసేన సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. గునపర్తి చిన్ని, బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో వాహనాలలో ర్యాలీగా వెళ్లారు.

● జీలుగుమిల్లి: తాడేపల్లిగూడెం సభకు మండలం నుంచి నేతలు తరలి వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి, ఉండవల్లి సోమసుందరం, బాసిన రాజబాబు, చిర్రి వెంకటేశ్వరావు, నాలి శ్రీను, గూడపాటి అరుణ్‌కుమార్, తమ్మన సాంబ, గద్దే సుబ్రహ్మణ్యం, జనసేన నేతలు గడ్డమణుగు రవికుమార్, చిర్రి బాలరాజు, పసుపులేటి రాము ఉన్నారు.



జంగారెడ్డిగూడెంలో ర్యాలీ ప్రారంభించిన రోషన్



జీలుగుమిల్లి నుంచి తాడేపల్లిగూడెం తరలిన నాయకులు



లింగపాలెం నుంచి బయలుదేరిన నేతలు



కొయ్యలగూడెం నుంచి వెళుతున్న నేతలు

టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి ప్రసాద్‌కు ప్రమాదం



చికిత్స పొందుతున్న ప్రసాద్

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 28: టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్‌కు ప్రమాదంలో కాలు విరిగింది. తాడేపల్లిగూడెంలో జనసేన టీడీపీ బహిరంగ సభకు ప్రసాద్ బుధవారం చేరుకున్నారు. అక్కడ కారు ప్రమాదం జరగడంతో కాలు తుంటి ఎముక విరిగిందని ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని డాక్టర్లు చెప్పినట్లు సమాచారం. ప్రైవేటు ఆసుపత్రికి ప్రసాద్‌ను తీసుకెళ్ళారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.

యువతిని మోసగించిన వైద్యుడు అరెస్టు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28 : యువతికి మాయమాటలు చెప్పి గర్భవతిని చేసి మోసగించిన వైద్యుడిని టూటౌన్ సీఐ ఎం ప్రభాకర్ బుధవారం అరెస్టు చేశారు. యువతి తల్లికి అనారోగ్యంగా ఉండడంతో వంగాయిగూడెం క్యాన్సర్ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ వైద్యుడిగా పనిచేస్తున్న నర్సరావుపేటకు చెందిన కారంపూడి చంద్రశేఖర్ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఆమె గర్భవతి కావడంతో అబార్షన్ చేయించాడు. పెళ్ళికి నిరాకరించాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు ఈనెల 27న కేసు నమోదు చేశారు. వైద్యుడిని బుధవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించింది.

ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా 'ఆప్తమిత్ర' డైరెక్టర్ పోటీ

పోలవరం, ఫిబ్రవరి 28: పోలవరం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ఆప్తమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ముచ్చిక రంజిత్ కుమార్ దొర బుధవారం తెలిపారు. చేగొండపల్లి పునరావాస గ్రామానికి చెందిన రంజిత్ కుమార్ దొర 2012 నుంచి సొంత ఖర్చులతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాడుతున్నారు. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

రాష్ట్రంలో ఆర్‌ఎల్‌జేపీ పోటీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలకు రాష్ట్రీయ లోక్‌జన్‌శక్తి పార్టీ పోటీ చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు చాగంటిపాటి జాన్‌వెస్లీ తెలిపారు. బుధవారం కేంద్రమంత్రి పసుపతికుమార్ పరాస్‌ను కలసినట్లు తెలిపారు. త్వరలో ఏలూరులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఏపీలోని అన్ని నియోజకవర్గాల్లో పట్టణ, మండలస్థాయి కమిటీలను పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుడతామని ఆయన తెలిపారు.

గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : పీవో



అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూర్యతేజ

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 28: ఐటీడీఏలో బుధవారం గిరిజన దర్బార్‌లో అందిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీవో ఎం.సూర్యతేజ అధికారులను ఆదేశించారు. గిరిజనుల నుంచి మొత్తం 38 వినతులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో సమస్యలు, ప్యాకేజి సమస్యలు, భూమికి భూమి, మౌలిక సదుపాయాలు సమస్యలు పరిష్కరించాలని, ఆర్ఓఎఫ్ఆర్, ఇళ్ల పట్టాలు అందజేయాలని గిరిజనులు అధికంగా వినతులను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ నాగేశ్వరావు, శ్రీనుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 28: ఉపాధి హామీ పథకంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ జేఏసీ సభ్యులు కోరారు. వారం రోజుల్లో తమ సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె చేపడతామని డ్వామా పీడీ అరవపల్లి రాముకు వినతిపత్రం అందజేశారు. జేఏసీ నేతలు వెంకటరమణ, కంప్యూటర్ ఆపరేటర్ నాయకులు పుష్పరాజు, బీఎఫ్‌టీ నేత నరేష్ తదితరులు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేసే సిబ్బంది తక్కువ వేతనంతో 18 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వారికి గ్రేడ్ ఫిక్స్ చేయడంలో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

యోగ లింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు, ఫిబ్రవరి 28: జోగన్నపాలెం యోగ లింగేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. 15 రోజులుగా ఆలయం వద్ద అగ్నిహోమం నిర్వహించి ధ్వజస్థంభం ప్రతిష్ఠ నిర్వహించారు. స్వామి వారికి మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాధమ్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, తపన చౌదరి పాల్గొన్నారు. ఆలయ శిఖరం,. ధ్వజస్తంభం, శిఖర చండేశ్వర, కాలభైరవ, ద్వారపాలక, జంట నాగులు విగ్రహాలను వేద పండితులు ప్రతిష్ఠించారు.

చిన వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 28: చినవెంకన్న ఆలయంలో పలు అభివృద్ధి పనులకు మంత్రులు తానేటి వనిత, కొట్టు సత్యన్నారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.6 కోట్లతో దేవస్థానం తలపెట్టిన రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులకు, సహస్ర దీపాలంకర మండప నిర్మాణానికి, రూ.16 కోట్లతో ధర్మ అప్పారావు నిలయంపై రెండో అంతస్తు నిర్మాణానికి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఆలయ ధర్మకర్త నివృతరావు, ఈవో వేండ్ర త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో టైలర్స్ డే



పట్టణంలో ర్యాలీ చేస్తున్న టైలర్లు

చింతలపూడి, ఫిబ్రవరి 28: టైలర్స్ డే సందర్భంగా పట్టణంలో టైలర్స్ ప్రభుత్వాసుపత్రి నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముందు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బి.సురేష్, ఎస్‌కే.జిలాని మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో త్వరలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని తీర్మానించినట్టు తెలిపారు.

● ఏలూరు రూరల్: వత్తేబాదలోని టైలర్స్ సంక్షేమ సంఘం భవనంలో బుధవారం టైలర్స్ డే ఘనంగా జరిగింది. కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎండీ హుస్సేన్, టి.వెంకట్, కె.శ్రీను, రంగ, నాగేంద్ర, సత్యనారాయణ, డి.నాగేశ్వరరావు, అశోక్, రాజు, సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

మద్ది క్షేత్రంలో ఆర్‌టీఐ కమిషనర్ పూజలు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 28 : గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఐలాపురం రాజా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకులు కె.రంగారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పండితులు వేద ఆశీర్వచనం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 28: భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు ముఖ్యమంత్రికి బుధవారం పోస్టుకార్డులను పంపించారు. ఏపీ భూహక్కుల యాజమాన్య చట్టం 27/2023 జీవో నెంబర్‌లు 512, 630 రద్దు చేయాలని కోరారు. బార్ అసోసియేషన్‌లో పలువురు న్యాయవాదులు ఐలా చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా పోస్టుకార్డులను రాసి పంపిస్తున్నారు.

2న పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

కామవరపుకోట, ఫిబ్రవరి 28: పురుషుల జిల్లా సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక పోటీ మార్చి 2న స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్టు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాము బుధవారం తెలిపారు. ఎంపికైన జట్టు నెల్లూరు జిల్లా కోవూరులో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొంటుందన్నారు. వివరాల కోసం 9398662362 నెంబర్‌లో సంప్రదించాలని రాము సూచించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కల్చరల్ :** నగరానికి చెందిన చిత్రకారుడు మజ్జి కాంతారావుకు మానవత ప్రతిభాపురస్కారంతో సత్కరించారు. సంస్థ ప్రతినిధులు దేవినేని భాస్కరరావు, టి.దేవరత్నాకరరావు, అడుసుమిల్లి నిర్మల, కె.కృష్ణారావు, ఎం.సత్యనారాయణ, వి.సాయిసుధ తదితరులు పాల్గొన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** జిల్లా వైద్యాధికారి కార్యాలయ ఆవరణలో మత సామరస్య దేవాలయం వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విఘ్నేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, ఏసుక్రీస్తు, అల్లా ప్రవక్త విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు, ప్రార్థనలు చేశారు.
- **ఏలూరు క్రైం :** నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బుధవారం రాత్రి విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. ఫైర్‌స్టేషన్, కోర్టు సెంటర్, ఆసుపత్రి రోడ్డు, ఆర్‌ఆర్‌పేట వైపు రోడ్లలో ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. షాపుల ముందు రోడ్లపై ఉంచిన బోర్డులను తొలగించారు. షాపు యజమానులకు హెచ్చరికలు చేశారు.
- **చింతలపూడి :** దళితవాడలకు వైసీపీ నాయకులు వచ్చినప్పుడు ప్రశ్నించాలని మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు అలగా రవికుమార్ అన్నారు. ఈప్రభుత్వం దళితులను దగా చేసిందన్నారు. ప్రగడవరంలో స్వతంత్ర అభ్యర్థి ఎస్.పెద్దిరాజుతో ప్రచారం నిర్వహించారు.
- చింతలపూడి మండలంలో ఎంపీ కోటగిరి శ్రీధర్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మారుతీనగర్‌లో వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. జడ్పీటీసీ నీరజ, ఎంపీపీ డి.రాంబాబు పాల్గొన్నారు.
- **పెదపాడు :** విద్యార్థి దశ నుంచే సేవా గుణం అలవర్చుకుని, లక్ష్య సాధన దిశగా శ్రమించాలని మెడబలిమి శైలజ జాన్సన్ తెలిపారు. పాతముప్పర్రు ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ విద్యార్థులకు మెడబలిమి కాంతమ్మ జ్ఞాపకార్థం ఉపకరణాలు, గోడ గడియారాలు పంపిణీ చేశారు.
- **టి.నరసాపురం :** మధ్యాహ్నపువారిగూడెం గ్రామానికి చెందిన మహిళ సారా విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ జయకుమార్ తెలిపారు.
- వల్లంపట్ల శివారులో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.52,500 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వి.జయకుమార్ తెలిపారు.
- **లింగపాలెం :** రంగాపురం ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో రామారావు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు బోధించాలన్నారు.



బహుమతులు అందుకున్న మాదేపల్లి విద్యార్థులు



టి.నరసాపురం మండలం విద్యార్థులకు బహుమతులు



లింగపాలెం మండలంలో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళి



కైకరం పాఠశాలలో విజ్ఞాన అంశాల ప్రదర్శన

సైన్స్ డే

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో పలు విద్యా సంస్థల్లో బుధవారం విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించారు. బాల బాలికలు సైన్స్ ఆవిష్కరణలు, ప్రయోగాలను ప్రదర్శించారు. సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూలులో సీవీ రామన్ వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పర్యావరణహిత ప్రయోగాలు, సౌరశక్తి విద్యుత్ ఉపకరణాలు ఎగ్జిబిషన్‌లో పెట్టారు. మాగంటి ప్రసాద్, వంకినేని రఘుకుమార్, సాయికుమారి శంకర్, రాజకళా శ్రీధరి తదితరులు పాల్గొన్నారు. తంగెళ్ళమూడి శ్రీసూర్య హైస్కూల్ విద్యార్థులు ఎకో సైన్స్ ప్రదర్శనలతో అలరించారు. సంతోషినగర్ శర్వాణీ హైస్కూలు విద్యార్థులు రామన్ ఎఫెక్ట్ గురించి వివరించారు. నారాయణపురం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం షేక్ మీరాసాహెబ్, స్కూల్ హెచ్ఎం సత్యశారద, డైరెక్టర్ మదన మోహనరాజు పాల్గొన్నారు.

యువజన సర్వీసుల శాఖ (సెట్ వెల్) ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్, సైన్స్ ప్రాజెక్టుల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సెట్‌వెల్ సీఈవో ఎండీ మెహర్రాజ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: మాదేపల్లి జడ్పీ హైస్కూల్లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దైనందిన జీవితంలో ఉపయోగపడేలా సైంటిఫిక్ రీసెర్చ్‌ను ప్రోత్సహించడానికి విద్యార్థినులు చేసిన థీమ్ ఆకట్టుకుంది. ఇన్‌చార్జి హెచ్‌ఎం పువ్వుల ఆంజనేయులు, సైన్స్ టీచర్లు వై.దుర్గ, యాస్మిన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణం, మండలంలో పలు పాఠశాలల్లో సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సుమారు 350 ప్రాజెక్టులు ప్రదర్శించారు. రోబోట్స్, హైడ్రాలిక్ లిఫ్టులు, జెసీబీ, డ్రిప్ ఇరిగేషన్, పవర్ జనరేటర్, రైన్ వాటర్ హార్వెస్టింగ్, వాక్యూమ్ క్లీనర్స్, మైక్రో ఆర్గానిజమ్స్, డైజెస్టివ్ సిస్టం మోడల్స్, ఆప్టికల్ ఇల్యూజన్, న్యూటన్ లాస్, బెర్నోలి ప్రిన్సిపల్, పాస్కల్లా, హ్యాండ్ శానిటైజర్ డిస్పెన్సర్, విండ్ మిల్, సేఫ్టీ అలారం, వాటర్ ప్యూరిఫైయర్, వాల్కనోస్ లాంటివి ఎన్నో ప్రదర్శించారు.



దెందులూరు మండలం కొవ్వలి పాఠశాలలో ప్రదర్శన

● టి.నరసాపురం: సమాజంలో మూఢ విశ్వాసాలను పోగొట్టి శాస్త్రీయ ఆలోచనలు కల్పించేందుకు సైన్స్ దోహదపడుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.పాండురంగారావు అన్నారు. విజన్ యూపీ స్కూల్, బండి వారి గూడెం యూపీ పాఠశాలలో సైన్స్ దినోత్సవం, జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థులు చిన్నతనం నుంచి విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. సమాజానికి మేలు చేసే వస్తువులను, విషయాలను కనుగొనేందుకు తమ జీవితాలను ధారపోసిన శాస్త్రవేత్తలను ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

● దెందులూరు: విద్యార్థులు చదువుతో పాటు మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ముందుకు సాగాలని కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శర్మ అన్నారు. విద్యార్థులు సైన్స్ డే అక్షర రూపంలో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉంగుటూరు, నారాయణపురం, కైకరం, రాచూరు హైస్కూల్స్, నారాయణపురం డిగ్రీ కళాశాలలో సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సైన్స్‌బొమ్మల రంగోలి నిర్వహించారు. భౌతిక జీవశాస్త్రాలకు సంబంధించిన చిత్రాలు గీసి అలరించారు. ఉపాధ్యాయుడు హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా సర్వశిక్షా అభియాన్ ఏపీసీ బి.సోమశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు మరింత విజ్ఞానం, నైపుణ్యం సాధించాలన్నారు. ఇటీవల సౌత్ ఇండియా స్థాయిలో నగదు బహుమతి పొందిన విద్యార్థులను అభినందిస్తూ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో జి.రామారావు, హెచ్ఎం వి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: హైస్కూల్‌లో హెచ్ఎం విజయ ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సైన్స్ మోడల్స్ ప్రదర్శించారు. సైన్స్ డే అక్షరాలతో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది.



చాట్రాయిలో చెరువు మట్టి తోలిన పొలం

పొలాలకు చెరువు మట్టి

▸ సారవంతమవుతాయంటున్న రైతులు

చాట్రాయి, ఫిబ్రవరి 28: చాట్రాయిలో రైతులు చెరువుల్లోని ఒండ్రు మట్టిని తోలుకొని భూములను సారవంతం చేసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా వ్యవసాయ అధికారులు చెరువుల్లోని ఒండ్రు మట్టిని భూముల్లోకి తోలుకుంటే సత్ఫలితాలు ఉంటాయని సూచిస్తుండగా, దీనిని కొందరు రైతులు అనుసరిస్తుండటం విశేషం. గ్రామాల్లో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవటం వల్ల భూములకు పశువుల ఎరువు వేయలేని పరిస్థితి వచ్చిందని, అధిక దిగుబడుల కోసం రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు విపరీతంగా వాడుతుండటంతో భూములు నిస్సారంగా మారిపోతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే భూములు సాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం వలన భవిష్యత్తులో వాటిల్లే నష్టాన్ని నివారించటానికి కొందరు రైతులు తమ భూములకు ఒండ్రు మట్టి వేసి సారవంతం చేసుకుంటున్నారు.

టెన్త్ పరీక్షల నిర్వహణపై రాష్ట్ర పరిశీలకుడి సమీక్ష

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28: జిల్లాలో టెన్త్ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్ మెంటల్ అధికారులు, హైస్కూల్ హెచ్ఎంలతో టెన్త్ పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ డైరెక్టర్ ఆర్.నరసింహారావు బుధవారం సమీక్షించారు. పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మార్చి 2న జిల్లాలోని పాఠశాలలు సందర్శిస్తారని, ఎటువంటి లోటుపాట్లులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలకు సూచించారు. తరగతిగదుల్లో ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పి), బైజూస్ కంటెంట్, ట్యాబ్‌ల వినియోగంపై దృష్టిసారిస్తారని, టీచర్ల లెసన్‌ప్లాన్స్, విద్యార్థుల వర్క్‌బుక్‌ల కరెక్షన్ కూడా పరిశీలించే అవకాశం ఉంద న్నారు. మరో 18రోజుల్లో ప్రారంభంకానున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాను కనీసం టాప్ టెన్ స్థానంలోనైనా ఉంచేలా ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో కష్టపడి పనిచేయాలన్నారు. పరీక్షల విధులకు, స్పాట్ వాల్యూయేషన్‌కు టీచర్లు సెల్‌ఫోన్‌లను తీసుకువెళ్ళి ఇబ్బందులు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. డీఈవో అబ్రహం, డీ వైఈవోలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ శ్రీకాంత్, ఎంఈవోలు పాల్గొన్నారు.

టెట్‌కు 54 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 : టెట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. బుధవారం ఉదయం పరీక్షకు 366మంది అభ్యర్థులకు 340 మంది, మధ్యాహ్నం పరీక్షకు 367మంది అభ్యర్థులకు 339 మంది హాజరయ్యారని ఆయన వివరించారు.

అంబేడ్కర్‌ను అవమానించేలా ప్రశ్నలు..

డీఈవోకు ఫిర్యాదు



డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న బీటీఏ నేతలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28: ఫార్మేటివ్ (ఎఫ్ఏ-4) పరీక్షల్లో భాగంగా ఈ నెల 26న జరిగిన 8వ తరగతి సోషల్ ప్రశ్నాపత్రంలో 5వ ప్రశ్న బీఆర్.అంబేడ్కర్‌ను అవమానించేదిగా ఉందని టీచర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నాయకులు బుధవారం డీఈవో అబ్రహంకు ఫిర్యాదు చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, సీహెచ్.ధర్మలింగం వివరాలు తెలిపారు. 'దళిత ఉద్యమ నాయకుడు ఎవరు' అనే ప్రశ్నకు జవాబుగా అంబేడ్కర్‌ను పేర్కొనడంపై అభ్యంతరం తెలిపారు. బహుముఖ ప్రజ్ఞాశాలిని ఒక దళిత నాయకుడిగా ముద్ర వేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. దీనికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠ్యాంశాల్లో కూడా దళిత నాయకుడిగా మాత్రమే ముద్రించడాన్ని తప్పుబడుతూ పునఃముద్రితం చేయాలని రాష్ట్ర విద్య, శిక్షణ, పరిశోధన మండలి(ఎస్సీఈఆర్టీ) ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తామన్నారు. డీఈవోను కలిసిన వారిలో శ్రీనివాసరావు, రమణ, కృపాకిరణ్, తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి ఎంఎస్ఎంఈ సర్వే

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరును మెరుగుపరిచి డేటాబేస్ అభివృద్ధి చేసేందుకు మార్చి 1 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజరు ఆదిశేషు బుధవారం తెలిపారు. ఈ సర్వేకోసం నియమించిన బృందానికి ఎంఎస్ఎంఈ అసోసియేషన్‌లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్‌లు, వర్తక, వాణిజ్య సంఘాలు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలు అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణాల్లో వార్డు సెక్రటరిలు సర్వే చేస్తారని తెలిపారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు అదనపు డెవలప్‌మెంట్ కమిషనర్ల ద్వారా సర్వే పురోగతిని కలెక్టర్ పర్యవేక్షిస్తారన్నారు.



రాజానగరం వద్ద దాత నిర్మించిన బస్ షెల్టర్ దుస్థితి (ఇన్‌సెట్) రామచంద్రపురం రోడ్డు వద్ద బస్‌షెల్టర్ దుస్థితి

దాతల ఔదార్యానికి తూట్లు

శిథిలావస్థలో బస్ షెల్టర్లు ప్రయాణికులకు నీడ కరువు

ముదినేపల్లి, ఫిబ్రవరి 28 : ప్రయాణికులకు నీడ కల్పించేందుకు దాతలు రహదారుల వెంబడి నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలమై నిరుపయోగంగా మారాయి. ఆనాడు వేలాది రూపాయల వ్యయంతో దాతలు నిర్మించిన ఆ షెల్టర్లు ఇప్పుడు నిర్మించాలంటే లక్షల్లోనే ఖర్చవుతుంది. ముదినేపల్లి మండలంలో సుమారు 50 ఏళ్ల క్రితం దాతల విరాళాలతో నిర్మించిన షెల్టర్లు శిథిలమైపోతున్నాయి. మండలంలోని రాజానగరంలో కనుమూరి కృష్ణంరాజు నిర్మించిన బస్ షెల్టర్ శిథిలమై ప్రయాణికులు కూర్చునేందుకు కూడా వీలు లేకుండా ఉంది. రామచంద్రపురం, కొత్తపల్లి, చినపాలపర్రు, పెదపాలపర్రు, చినవాడవల్లి, శ్రీహరిపురం, చేవూరు, బొమ్మినంపాడు తదితర గ్రామాల వద్ద దాతలు నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలమవుతుండగా, దాతల వారసులు కూడా పట్టించుకోకపోవటంతో అవి కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. కొన్ని షెల్టర్లు యాచకులకు ఆవాసాలుగా మారాయి. ఈ షెల్టర్లు నిర్వహణా లోపంతో పాడైపోవటంతో ప్రయాణికులకు నీడ కరువైంది.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ముసునూరు, ఫిబ్రవరి 28: బలివే తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సెబ్ అధికారులు సీజ్ చేశారు. బలివే తమ్మిలేరులో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని స్పందనలో ఫిర్యాదు అందిందని, ఈ నేపథ్యంలో బుధవారం బలివే తమ్మిలేరు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ వెంకట రమణ తెలిపారు. యాజమానులపై కేసు నమోదు చేశామన్నారు. తమ్మిలేరు నుంచి ఇసుక రవాణాకు అనుమతులు లేవని, అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు భారీ జరిమానా విధిస్తామని సీఐ హెచ్చరించారు.



మొక్కజొన్న యంత్రంపై ప్రమాదకరంగా వెళుతున్న కూలీలు

ప్రాణాలు పణంగా పెట్టి..

▸ ప్రమాదకరంగా కూలీల ప్రయాణం

▸ పట్టించుకోని అధికారులు

చాట్రాయి, ఫిబ్రవరి 28: రెక్కాడితేనే గాని డొక్కాడని కూలీలు నిత్యం ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రమాదకరంగా పనులకు వెళ్ళి వస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదు. ట్రాక్టర్లు, మొక్కజొన్న వలిచే యంత్రాలపై, ఆటోలపై పరిమితికి మించి కూలీలను ఎక్కించి అతివేగంగా దూసుకుపోతున్నారు. రోడ్డు టర్నింగ్‌ల దగ్గర కూడా వేగం తగ్గించకపోవటంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయాందోళన చెందుతున్నారు. 7, 8 మంది ఎక్కవలసిన ఆటోలపై 20 మంది వరకు కూలీలను ఎక్కిస్తున్నారు. గతంలో ఏ గ్రామం కూలీలు ఆ గ్రామంలోనే పనులు చేసుకునే వారు. ఆటోలు ఇతర వాహనాలు పెరిగిన తరువాత కూలీలు పక్క గ్రామాలు, మండలాలు, జిల్లాలకు పను లకు వెళ్ళి సాయంత్రానికి ఇళ్ళకు చేరుకుంటున్నారు. కూలీల కొరత కారణంగా రైతులు, యజమానులు వాహనాలు ఏర్పాటు చేసి, అధిక వేతనం ఇచ్చి ఎంత దూరం అయినా పనులకు తీసుకువెళుతున్నారు. ఎక్కువ వేతనం వస్తుందనే ఆశతో కూలీలు కూడా ప్రమాదాలకు ఎదురెళుతున్నారు. కూలీలను తరలించే ఆటోలు ఇతర వాహనాలలో అధిక లోడు, అతి వేగం నియంత్రించటంలో పోలీసులు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో ఎక్కువ మంది వాహన చోదకులు నిర్లక్ష్యంగా బండ్లు నడుపుతున్నారు. అధికారులు స్పందించి కూలీలను రవాణా చేసే వాహనాలలో అధికలోడు, అతివేగం నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.



కైకలూరు నుంచి తాడేపల్లిగూడెం సభకు వెళ్తున్న టీడీపీ నేతలు



తాడేపల్లిగూడెం సభలో పాల్గొన్న ముదినేపల్లి టీడీపీ నాయకులు

గూడెం సభకు తరలిన శ్రేణులు

కైకలూరు, ఫిబ్రవరి 28: తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభకు కైకలూరు నియోజకవర్గం నుంచి ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. బుధవారం కైకలూరు పార్టీ కార్యాలయం నుంచి వందలాది కార్లలో కార్యకర్తలు బహిరంగ సభకు బయల్దేరారు. ర్యాలీకి టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు జెండా ఊపి ప్రారంభించారు. జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, బీవీ రావు ఆధ్వర్యంలో వేరువేరుగా పెద్దఎత్తున కార్లు, బైక్‌లపై భారీగా బహిరంగ సభకు వెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఈ బహిరంగ సభ ప్రజల్లో మరింత నూతన ఉత్తేజాన్ని కల్గిస్తున్నాయని టీడీపీ-జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఒకే వేదికపై నుంచి ప్రజలకు సందేశాన్ని ఇవ్వడం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. ఉమ్మడి అభ్యర్థుల జోరుతో వైసీపీ ప్రభుత్వాన్ని తరమి కొడతామన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, టీడీపీ నాయకులు చాబత్తిన విజయ్, తేరా రమేష్, కురేళ్ళ ఇస్సాక్, వీరాబత్తిన సుధా, పళ్ళెం తాతారావు తదితర నాయకులు తరలివెళ్లారు.

ముదినేపల్లి: తాడేపల్లిగూడెంలో బుధవారం జరిగిన తెలుగుదేశం - జనసేన ఉమ్మడి బహిరంగ సభకు ముదినేపల్లి మండలం నుంచి పెద్ద సంఖ్యలో రెండు పార్టీల కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కొడాలి వినోద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, పార్టీ నాయకులు చల్లగుళ్ల ఆదిత్య, బొంగు రవికుమార్, పంతగాని సురేష్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, నాయకులు గుడిసేవ సురేష్, బత్తుల హరీష్ నాయకత్వంలో ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు గూడెం సభకు తరలివెళ్లారు.

కలిదిండి: తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్వహించిన జెండా సభకు కలిదిండి నుంచి టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు కార్లు, బైక్‌లపై భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ - జనసేన కలయికతో వైసీపీ ఓటమి ఖాయమన్నారు.



అల్లూరులో గంగానమ్మ వారికి పూజలు

వైభవంగా గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ముదినేపల్లి, ఫిబ్రవరి 28 : అల్లూరులో గంగానమ్మ ఆలయాన్ని గ్రామ స్థులు నిర్మించారు. ఇప్పటివరకు తాత్కాలిక ఆలయంలో పూజలు నిర్వహించగా, దాతల విరాళాలతో నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రెడ్డి విఠల్ దంపతులు హోమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ దంపతులు, ఎంపీటీసీ రెడ్డి సతీష్ బాబు తదితరులు పూజలు చేశారు.

2న పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

కామవరపుకోట, ఫిబ్రవరి 28: పురుషుల జిల్లా సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక పోటీ మార్చి 2న స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వ హిస్తున్నట్టు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాము బుధవారం తెలిపారు. ఎంపికైన జట్టు నెల్లూరు జిల్లా కోవూరులో నిర్వహించే టోర్న మెంట్‌లో పాల్గొంటుందన్నారు. వివరాల కోసం 9398662362లో సంప్రదించాలని రాము సూచించారు.

ఘనంగా టైలర్స్‌డే



కైకలూరు, ఫిబ్రవరి 28: దర్జీలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. బుధ వారం టైలర్స్ డే సందర్భంగా కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కుట్టుమిషన్ సృష్టకర్త విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పించి అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ డీఎం నవరత్న కుమారి, టైలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాడపల్లి శ్యామలరావు, సభ్యులు మహ్మద్ సుల్తాన్, బత్తిన రాంబాబు, అమీర్ బాషా, మహ్మద్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు ఉచిత అడ్మిషన్లు

ముసునూరు, ఫిబ్రవరి 28: విద్యాహక్కు చట్టం కింద 2024-25 సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి బీవీఎస్ సుబ్బారావు కోరారు. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. మార్చి 14 వరకు ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు ముసునూరులో తమ కార్యాలయంలో గాని, డీఈవోను గాని టోల్ ఫ్రీ నంబర్ 1800 4258599లో సంప్రదించాలని కోరారు.



నూజివీడు త్రివిధ పాఠశాలలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



తుమ్మగూడెంలో సీవీ రామన్ చిత్రపటానికి చిన్నారుల నివాళి

ఘనంగా సైన్స్ దినోత్సవం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 28: సైన్స్ దినోత్సవాన్ని నూజివీడులో ఘనంగా నిర్వహించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో పీయూసీ విద్యార్థులు పలు ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. నూజివీడు త్రివిధ పాఠశాలలో విద్యార్థులు ఎలక్ట్రికల్ పరికరాలు వాడే విధానం, వ్యవసాయ భూముల సంరక్షణ, నీటి సంరక్షణ తదితర అంశాలపై ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. నూజివీడు మండలం గొల్లపల్లి అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం రవీంద్ర, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి: తుమ్మగూడెం ఉర్దూ పాఠశాల, పోలవరం జడ్పీ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ సర్ సీవీ రామన్ పరిశోధనలు, వాటి ఫలితాలు మానవాళికి ఎంతో ఉపయోగ పడటం భారతీయులందరికి గర్వకారణమన్నారు. రామన్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు మరిన్ని ప్రయోగాలు చేసి మానవాళి అభివృద్ధికి కృషి చేయాలని ఉద్బోధించారు.



కొండంగి ఎత్తిపోతల పథకం

చేపలు, రొయ్యల సాగుకు.. ఉప్పునీటి గండం

▸ కొండంగి ఎత్తిపోతలలోకి సముద్రం నీరు వచ్చే ప్రమాదం

కలిదిండి మండలంలోని కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాల ద్వారా సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. దీంతో లంక గ్రామాల్లో చేపలు, రొయ్యల సాగు పుష్కలంగా సాగుతోంది. అయితే పంట కాల్వలకు సాగునీరు సక్రమంగా సరఫరా కాక లంక గ్రామాల్లో చేపలు, రొయ్యల చెరువులకు నీటి కొరత ఏర్పడి చెరువులు అడుగంటాయి. సాగునీటి కొరత తీర్చటానికి ఎత్తిపోతల పథకాల ద్వారా ఉప్పుటేరులో తీపి నీటిని కాల్వలోకి ఎత్తిపోస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ఎత్తిపోతలకు సముద్ర నీరు చొచ్చుకొచ్చే ప్రమాదం ఉండడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

కలిదిండి, ఫిబ్రవరి 28 : మండలంలో ప్రస్తుతం 23 వేల ఎకరాల్లో చేపల సాగు చేస్తుండగా, ఎత్తిపోతల పథకాల ద్వారా వీటికి సాగునీరు సరఫరా చేస్తున్నారు. వంతుల వారీగా చేపలు, రొయ్యల చెరువులను నింపుతున్నారు. టీడీపీ హయాంలో అప్పటి మంత్రులు కామినేని శ్రీనివాస్, దేవినేని ఉమా, ఎంపీ మాగంటి బాబు సుమారు రూ.13 కోట్లతో కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. పంట కాల్వలకు సాగునీటి కొరత ఏర్పడినప్పుడల్లా కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలు రైతులను ఆదుకుంటున్నాయి. ఉప్పుటేరులో తీపి నీరు కాల్వలోకి ఎత్తిపోయటంతో చేపల చెరువులను నింపుకుంటున్నారు. ఉప్పుటేరులో నీరు చేపల సాగుకు అనుకూలంగా ఉండటంతో అధిక శాతం రైతులు ఉప్పుటేరు నీటిని చెరువులకు తోడుతున్నారు.

మార్చిలో ఉప్పునీరు చొచ్చుకొచ్చే ప్రమాదం?

మార్చి నెలలో ఉప్పుటేరులోకి సముద్ర నీరు చొచ్చుకొచ్చే ప్రమాదం ఉంది. కాల్వల్లో నీరు ఉప్పుటేరులో కలవటంతో ఇప్పటి వరకు ఉప్పుటేరులో తీపి నీరు ఉంది. ప్రస్తుతం కాల్వల్లో నీరు సరఫరా కాకపోవటంతో సముద్రం నీరు మరో పది రోజుల్లో ఎత్తిపోతల పథకాల వద్దకు చొచ్చుకుని వచ్చే ప్రమాదం ఉండటంతో రేయింబవళ్లు నిరంతరాయంగా ఉప్పుటేరులో నీటిని ఎత్తిపోస్తున్నారు. ఈ ఏడాది ముందస్తుగా ఉప్పునీరు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. పెదలంక డ్రెయిన్‌లో ఇప్పటికే సముద్రపు ఉప్పునీరు వచ్చేసింది. ఎత్తిపోతలకు 15 కిలోమీటర్ల దూరంలో ఉప్పునీరు పొంచి ఉంది. దీంతో రైతులు హడావిడిగా ఎత్తిపోతల ద్వారా చెరువులను నింపుకుంటున్నారు.

చిన్నగొల్లపాలెం వద్ద రెగ్యులేటర్ నిర్మించాలి..

ముందస్తుగా ఉప్పునీరు రావటంతో సాగునీటి సమస్య ఏర్పడుతుందని, ఏప్రిల్‌లో రావాల్సిన ఉప్పునీరు మార్చిలోనే రావటంతో ఎత్తిపోతల నిలుపుదల చేయాల్సి వస్తోందని, చిన్న గొల్లపాలెం వద్ద రెగ్యులేటర్ నిర్మిస్తే సుమారు లక్ష ఎకరాలు సాగులోకి వస్తాయని ఆక్వా రైతులు అభిప్రాయపడుతున్నారు.



కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

కైకలూరులో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

▸ పరీక్షలు రాయనున్న 1039 మంది విద్యార్థులు

కైకలూరు, ఫిబ్రవరి 28: ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి జరుగుతున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 1వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. కైకలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీదత్తాత్రేయ జూనియర్ కోఆపరేటివ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్షా హాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 310 మంది, రెండో సంవత్సరం 223 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. రవిచంద్ర తెలిపారు. అలాగే శ్రీ దత్తాత్రేయ జూనియర్ కోఆపరేటివ్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 285 మంది, రెండో సంవత్సరం 221 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు సీఎస్ శ్రీనివాసరావు తెలిపారు. అలాగే మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సైతం ఈ పరీక్షా కేంద్రాల్లోనే పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అధ్యాపక బృందం సైతం సెల్‌ఫోన్లు వినియోగించరాదన్నారు. కైకలూరులో 1039 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు.

బలివే ఆలయాన్ని సందర్శించిన డీఎస్పీ



ముసునూరు, ఫిబ్రవరి 28: బలివే రామలింగేశ్వర స్వామిని నూజివీడు నూతన డీఎస్పీ గోలి లక్ష్మయ్య బుధవారం దర్శించు కుని పూజలు చేశారు. ఆలయంలో ఐదురోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో బందోబస్తు, ట్రాఫిక్ సమస్య, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఆలయ ఛైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఎస్ఐ పి.వాసుతో డీఎస్పీ చర్చించారు. అనంతరం తమ్మిలేరులో తాత్కాలిక రహదారి పరిస్థితి, జల్లు స్నాన ఘాట్‌లు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, ఫిబ్రవరి 28: మండలంలోని పోలవరం, చీపురుగూడెం సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

నేడు ఏరియా ఆస్పత్రి భవనాలు ప్రారంభం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 28: నూజివీడు ఏరియా ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన భవనాలను గురువారం రాష్ట్ర రవాణా శాఖామంత్రి పినిపే విశ్వరూప్, వైద్య ఆరోగ్య శాఖామంత్రి విడదల రజినీ ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీఆర్ మోహన్ తెలిపారు. నూతన భవనాలను గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు, ముఖ్య అతిథులుగా నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ హాజరవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

తామర పురుగుల ఉధృతిని అరికట్టాలి



మామిడితోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారిణి

నూజివీడు, ఫిబ్రవరి 28: మామిడిలో తామర, కొక్కెం పురుగులు ఉధృతి అధికంగా కనిపిస్తోందని, వీటి నివారణకు మామిడి రైతులు తగు చర్యలు తీసుకోవాలని నూజివీడు ఉద్యానవనశాఖ అధికారిణి హేమ తెలిపారు. నూజివీడు మండలం యనమదల, బత్తులవారిగూడెం, సుంకొల్లు గ్రామాల్లో ఆమె మామిడి తోటలను పరిశీలించి మాట్లాడుతూ మామిడిలో తామర, కొక్కెం పురుగులు ఉధృతి బాగా ఉందని, వీటి నివారణకు తోటల్లో జిగురు అట్టలను, పసుపు, నీలం రంగు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటితో పాటు 1500 ఎంఎం, పీపీఎం వేపనూనె 3 ఎంఎల్ లీటరు నీటికి, తామర పురుగులు అధికంగా ఉంటే స్పైనో సాడ్ 0.25 ఎంఎల్ లీటరు నీటికి లేదా పొంగామియాసోప్ 7.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అదేవిధంగా కొక్కెం పురుగు నివారణకు క్లోరిపైరిపాస్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పీవీఆర్ ట్రస్ట్ చేయూత



చెక్కులను అందిస్తున్న పీవీఆర్ వెంకటాచలం

కలిదిండి, ఫిబ్రవరి 28 : పెదలంకలో బుధవారం పీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పిల్లారిశెట్టి వెంకట రమేష్, కలిదిండి మండల ఆది వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీటెక్ చదువుతున్న 10 మంది విద్యార్థులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆది వెలమ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అక్కల వెంకటాచలం మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించటానికి పీవీఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత ముందుకు రావటం అభినందనీయమన్నారు. పేదరికంతో ఉన్నత విద్యను అభ్యసించలేక మధ్యలోనే చదువు మానేసిన వారి వివరాలు తమ దృష్టికి తెస్తే సంఘం, ట్రస్ట్ తరపున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఆదివెలమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుగ్గిరాల రంగారావు, సంఘం నాయకులు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు, సత్యనారాయణ, మాదిరెడ్డి కుసుమ హరనాథ్, కోటి లింగం, పోకల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మినప నారు పంపిణీ



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 28: నూజివీడు మండలం మిట్ట గూడెం గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరం 4వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా నూజివీడు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, వివిధ పద్ధతుల్లో ఎండుపూల నుంచి సువాసన నూనెల తయారీ, ఇంటి పెరట్లో టమాట, మిర్చి, పెంపకం ద్వారా టమాట, చిల్లీ సాస్ తయారీ విధానాలను గ్రామస్థులకు వివరించారు. డ్వాక్రా మహిళలతో పాటు కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, సిబ్బంది డాక్టర్ కంచన, డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు వలంటీర్లు మినప నారును అందించారు.